నెహ్రూ నగర్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న మహిళలు



ఫ్యాను తిరిగితే కరెంటు బిల్లు ఎవరు కట్టాలి?

- అధిక కరెంటు చార్జీలపై ఎమ్మెల్యేను ప్రశ్నించిన మహిళలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 8: జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. గురువారం ఆయన పలువురు వైసీపీ నేతలతో కలసి జమ్మలమడుగు మున్సిపాలిటీ 14వ వార్డులోని నెహ్రూ నగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఓ ఇంటి వద్దకు వచ్చారు. ఆ సమయంలో ఆ ఇంటి వృద్ధురాలు విజయ, ఆమె కోడలు ఫ్యాన్ వేసుకోకుండా కూర్చుని ఉన్నారు. అది చూసిన ఎమ్మెల్యే వేడిలో కూర్చున్నారు ఫ్యాన్ తిప్పండి అని వారికి సూచించారు. వెంటనే వారు బయటకు వచ్చి "మీరేమో ఫ్యాను తిప్పాలని చెప్పారు. పెంచిన కరెంటు బిల్లులు వాచిపోతున్నాయి.. ఆ బిల్లులు ఎవరు కట్టాలి" అని ప్రశ్నించారు. పథకాలు ఇస్తున్నాం, రూ.3 వేలు పెన్షన్ ఇస్తున్నామని ఎమ్మెల్యే బదులివ్వగా.. వెంటనే వారు మాట్లాడుతూ జగన్ ఇచ్చిన పెన్షన్ రూ.3 వేలు, పెంచిన ధరలకు అందులో కరెంటుకే సరిపోతున్నాయని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ వీధిలో ఎస్పీజీ క్వార్టర్స్ చర్చి ఎదురుగా డ్రైనేజీ కాలువలు దారుణంగా ఉన్నాయని, కరెంటు స్తంభాలు ఒరిగాయని తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు స్థానికులు తెలిపారు.

ప్రతినెలా 1వ తేదీనే జీతాలివ్వాలని ధర్నా చేస్తున్న శాశ్వత ఉద్యోగులు



ఆర్టీపీపీలో ధర్నాల మోత

- 1వ తేదీనే జీతాలివ్వాలని శాశ్వత ఉద్యోగుల డిమాండ్
- రెగ్యులర్ చెయ్యాలని కాంట్రాక్టు కార్మికుల ధర్నా

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 8: ఆర్టీపీపీలో ధర్నాల మోత మోగుతోంది. తమకు వేతనాలు 1వ తేదీనే ఇవ్వాలని ఉద్యోగులు, ఇంజినీర్లు, ఇతర శాశ్వత ఉద్యోగులు ఐదురోజులుగా ధర్నా చేస్తున్నారు. వీరికి ఇటీవల వేతనాలు ఆలస్యంగా అందుతున్నాయి. దీంతో తమకు ప్రతి నెలా మొదటి తేదీనే వేతనాలు ఇవ్వాలని ఇప్పటికే గత రెండు నెలలుగా మొదటివారంలో ధర్నా చేశారు. అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదు. యధావిధిగా 10వ తేదీ దాటిన తర్వాతనే జీతాలు వారి ఖాతాల్లోకి వేస్తున్నారు. అలాగే చాలీచాలని జీతాలతో దశాబ్దాల తరబడి పనిచేస్తున్నామని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని కాంట్రాక్టు కార్మికులు గురువారం ఆర్టీపీపీలో ధర్నా ప్రారంభించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ అధికారంలోకి రాగానే తన మొదటి హామీని కచ్చితంగా నెరవేరుస్తానని చెప్పి వారికి మొండిచేయి చూపారు. దీంతో శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఆందోళన పట్టారు.

1న జీతాలివ్వాల్సిందే..

ప్రతినెలా 1వ తేదీనే తమకు జీతాలివ్వాలని ఆర్టీపీపీలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులు ఐదురోజులుగా ఉదయం 9 గంటల నుంచి 10గంటల వరకు మెయిన్‌గేటు వద్ద ధర్నా చేస్తున్నారు. ఆర్టీపీపీలోని అన్ని కార్మిక సంఘాల ఐక్యతతో ఈ ధర్నా చేస్తున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదని కార్మిక సంఘాల నాయకులు గురువారం ఆరోపించారు. ఇకపై ఊరుకోమని, విద్యుత్ ఉద్యోగుల తడాఖా ఎంటో చూపిస్తామని హెచ్చరించారు.

జగన్ మొండిచేయి చూపారు

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న వేలాదిమంది కాంట్రాక్టు కార్మికులను తాము అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేస్తామన్న జగన్ తమకు మొండిచేయి చూపించారని గురువారం చేసిన ధర్నాలో కాంట్రాక్టు కార్మికులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు వి.సుబ్బిరెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికి కార్మికులు ఎదురుచూస్తూనే ఉన్నారన్నారు. విద్యుత్ రంగంలో శాశ్వత ఉద్యోగులు చేస్తున్న పనినే కాంట్రాక్టు కార్మికులు చేస్తున్నారని వారికి కోర్టు తీర్పును అనుసరించి వేతనాలివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు వెంకటస్వామి, హరి ఓబుల్‌రెడ్డి, వి.గంగయ్య, నాగేంద్ర, డి.పుల్లారెడ్డి, చంద్రశేఖర్, రమణ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




తమను రెగ్యులర్ చేయాలని ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

బాధ్యతలు చేపట్టిన ఆర్జేడీ, డీఈవో

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 8: పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా ఎద్దుల రాఘవరెడ్డి బాధ్యతలు చేపట్టారు. గురువారం ఆర్జేడీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే రాష్ట్రంలోనే ఈ జోన్‌ను ఉన్నత స్థానంలో నిలిపేందుకు తన శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

అలాగే.. జిల్లా విద్యాశాఖాధికారిగా మర్రెడ్డి అనురాధ గురువారం డీఈవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని ఆమె విలేకరులకు తెలిపారు. సిలబస్ పూర్తయిందన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణకు పాఠశాల ప్రధానోపాధ్యాయులతో చర్చించినట్లు తెలిపారు. కాగా.. అనురాధ గ్రూప్2 ద్వారా 1991లో డీజీజీ ఆఫ్ ప్రిజినర్స్ (హైదరాబాదు)శాఖలో జూనియర్ అసిస్టెంటుగా విధులు ప్రారంభించారు. అప్పటి నుంచి వివిధ హోదాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2015లో కర్నూలు డీఈవో కార్యాలయం ఏడీ-1గా బదిలీపై వచ్చారు. 2022 నుంచి నంద్యాల డీఈవో కార్యాలయం ఏడీగా పనిచేస్తూ ప్రస్తుతం పదోన్నతిపై కడప జిల్లా డీఈఓగా బాధ్యతలు చేపట్టారు.



ఆర్జేడీగా బాధ్యతలు చేపడుతున్న రాఘవరెడ్డి



డీఈవోగా బాధ్యతలు చేపడుతున్న ఎం.అనురాధ

వైసీపీ కవ్వింపు చర్యలు

- టీడీపీ స్టిక్కర్లు, ఫ్లెక్సీల చించివేత
- సోషల్ మీడియా పోస్టులపై అక్రమంగా కేసులు
- టీడీపీ, వైసీపీ నేతల బాహాబాహీ
- పోలీసుస్టేషన్‌లో వైసీపీ మార్కు వీరంగం
- రెచ్చగొట్టేలా మీడియా ఎదుట ప్రసంగాలు
- ఈసారి ఎన్నికలు రణరంగమే



టూటౌన్ పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప అసెంబ్లీ నియోజవర్గానికి 2004 నుంచి కాంగ్రెస్, వైసీపీ అభ్యర్థులే ఎమ్మెల్యేగా ఎన్నికవుతున్నారు. అయితే ఈసారి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై ప్రత్యేకదృష్టి పెట్టారు. కడప ఇన్‌చార్జిగా పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సతీమణి మాధవీరెడ్డిని నియమించారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరుతో శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డిలు డోర్ టు డోర్ విస్తృతంగా పర్యటిస్తున్నారు. దాదాపు 47 వేల కుటుంబాల వద్దకు వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. దీనికి తోడు అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డిలు సైతం ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ఎక్కువగా వస్తున్నాయి. దీనిని వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు.

ఎదురుదాడి

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సైతం గడపగడప మన ప్రభుత్వం పేరిట నగరంలో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లారు. అయితే ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు ఎక్కువయ్యాయి. అంజద్‌బాషా పాలనలో అభివృద్ధి లేదంటూ మాధవీరెడ్డి అటాక్ చేస్తూ వచ్చారు. దీనికి కౌంటరుగా మాధవీరెడ్డిని ఫ్లెక్సీల రాణి అంటూ అంజద్‌బాషా విమర్శిస్తూ వచ్చారు. ఇది చిలికి చిలికి గాలివానలా మారి తీవ్ర స్థాయిలో హెచ్చరించుకునే స్థాయికి వెళ్లింది.

కేసులు, దాడులు

వైసీపీని విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టినా కంప్లయింట్ ఇచ్చినా చాలు పోలీసులు ఆగమేఘాల మీద స్పందిస్తున్నారు. రహదారి విస్తరణకు సంబంధించి ఓ మీడియా వైరల్ చేయడం చర్చనీయాంశంగా మారి అప్పట్లో టీడీపీ నేతలపై కేసులు నమోదు చేస్తూ వచ్చారు. భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా టీడీపీ నేతలు పర్యటించినప్పుడు ఇంటింటికీ స్టిక్కర్లు అతికించడంతో పాటు ఆ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు కట్టారు. ఇటీవల 31వ డివిజన్‌లో టీడీపీ అతికించిన స్టిక్కర్లను వైసీపీ నేతలు చించడం ఉద్రిక్తతకు దారి తీసింది. అలాగే 36వ డివిజన్‌లోని బళ్లారిరోడ్డులో ఫ్లెక్సీలు చించడం దుమారం రేపింది. మాచుపల్లె సర్కిల్‌లో స్టిక్కర్లను చించివేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి వివాదం కొనసాగుతోంది. గురువారం 31వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి ఆరిఫుల్లా, వైసీపీ కార్పొరేటరు కుమారుడు మధ్య సోషల్ మీడియా పోస్టుల వివాదం దాడికి తెర లేపింది. దాడి చేసిన వారిపై కేసు నమోదు కోసం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో కలసి టూటౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లగా.. మేయరు సురేశ్‌బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు అహ్మద్ అనుచరులతో టూటౌన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లోనే వైసీపీ నేతలు బండబూతులు తిడుతూ సవాళ్లు విసరడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. దాదాపు రెండుగంటల పాటు స్టేషన్‌లోనే వైసీపీ నేతలు మకాం వేశారు. తమముందే వైసీపీ నేతలు రెచ్చిపోతున్నా పోలీసులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండడం గమనార్హం. పరిస్థితి చేయి దాటేవిధంగా ఉండడంతో పోలీసులు టీడీపీ నేతలను పంపించి వేశారు. ఈ సందర్భంగా డిప్యూటీసీఎం తమ్ముడు అహ్మద్‌బాషా పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డిపై పరుష పదజాలంతో మాట్లాడారు. మీ రెడ్ బుక్ కాదు.. మా నాయకుడు ఒకే అంటే.. మీ ఇంటి మీదకే జొరబడతామనే విధంగా హెచ్చరికలు చేస్తూ పత్రికల్లో రాయలేని భాషలో దూషించారు.

ఈ ఎన్నికలు ఆషామాషీ కాదు

వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఎలాగైనా గెలవాలని వైసీపీ ఎలాంటి అడ్డదారుల్లో వెళ్లడానికైనా రెడీగా ఉందని ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే టీడీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించడం, ఒకే ఇంటిలోని ఓట్లను వేర్వేరు బూత్‌లకు మార్చినట్లు ఆరోపణలున్నాయి. చనిపోయిన వారి ఓట్లను తొలగించకుండా దొంగ ఓట్లను గుద్దుకునే ప్లాన్ వేశారని టీడీపీ ఆరోపిస్తూ వస్తోంది. ఎలాగూ వలంటీర్లు, మరికొందరిని అడ్డుపెట్టుకుని ఓటు వేయకపోతే పథకాలు రావంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే పోలింగ్ రోజున దాడులకు కూడా వెనుకాడరనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే టీడీపీలో చురుగ్గా ఉండే నేతలను బైండోవర్ కేసుల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇప్పటి దాకా కడప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అయితే ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలు గమనిస్తే ఈసారి ఎన్నికలు మాత్రం ఆషామాషీ కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.



ఎన్నికల షెడ్యూలు విడుదల కాకముందే కడపలో పాలిటిక్స్ హాట్‌హాట్‌గా మారాయి. ఇటీవల వైసీపీ కవ్వింపు చర్యలు మరింత రాజకీయ వేడిని పెంచేశాయి. తప్పు చేసిన నేతలు, వత్తాసు పలుకుతున్న అధికారులు, వలంటీర్ల వివరాలను రెడ్‌బుక్‌లో రాసుకుంటున్నామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానిస్తే.. మేం ఫ్యాక్షన్ మరిచిపోలేదు... నేరుగా మీ ఇంటికే వస్తాం.. నా కొడకా.. ఏమైనా పీక్కుంటావా అంటూ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు అహ్మద్ బాషా చేసిన బహిరంగ వ్యాఖ్యలు.. మరింత ఆజ్యం పోశాయి. టీడీపీ, వైసీపీ సవాళ్లు, ప్రతిసవాళ్లు, ఇటీవల జరిగిన సంఘటనలు చూస్తే ఈసారి ఎన్నికలు ఆషామాషీ కాదని తెలుస్తోంది. గెలుపు కోసం వైసీపీ ఎంతకైనా తెగిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఇరువర్గాల ఘర్షణ

- వైసీపీ కార్యకర్తకు స్వల్ప గాయం
- పోలీసుస్టేషన్‌లో పరస్పర ఫిర్యాదు
- ఇరుపక్షాల సవాళ్లు, ప్రతిసవాళ్లు
- సర్దిచెప్పే యత్నం చేసిన పోలీసులు
- పోలీసులపైనే దురుసుగా ప్రవర్తించిన వైసీపీ కార్యకర్తలు
- టీడీపీ నేతలపై అహ్మద్‌బాషా బూతుపురాణం

కడప (క్రైం), ఫిబ్రవరి 8: కడప నగరం 37వ డివిజన్‌లోని మాసీమ సర్కిల్ సమీపంలో టీడీపీ, వైసీపీ నేతల మధ్య ఘర్షణ గురువారం చోటు చేసుకుంది. సోషల్ మీడియాలోని ట్విట్టర్‌లో పోస్టు పెట్టడంతో 39వ డివిజన్ వైసీపీ కార్పొరేటరు కొడుకు పీరుల్లా, ఆ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి ఆరిఫ్ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో వైసీపీ కార్యకర్త స్వల్పంగా గాయపడ్డారు. దీంతో పరస్పరం ఫిర్యాదు చేసుకునేందుకు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. మేయరు సురేశ్‌బాబు, డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్‌బాషాతో పాటు పలువురు కార్పొరేటర్లు వైసీపీ కార్యకర్తలు చేరుకోగా.. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో కలసి అక్కడకు చేరుకున్నారు. జరిగిన సంఘటన గురించి ఆరా తీస్తున్న సమయంలో పరస్పర వాగ్వాదానికి దిగారు. సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. పోలీసులు సర్దిచెప్పేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. వైసీపీ శ్రేణులు పోలీసులపై సైతం దురుసుగా ప్రవర్తించారు. డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్‌బాషా పోలీస్‌స్టేషన్‌లో చాలా అసభ్య పదజాలంతో టీడీపీ వారిని దూషించారు. దీంతో కడప డీఎస్పీ షరీఫ్, సీఐలు, ఎస్‌ఐలు భారీగా పోలీసుస్టేషన్ వద్దకు చేరుకుని ఎలాంటి గొడవ జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యుడు శ్రీనివాసరెడ్డిని పోలీసులు అక్కడ నుంచి పంపించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్ వెలుపల మీడియాతో మాట్లాడారు. దౌర్జన్యం చేయడమే కాకుండా బూతులు తిడుతుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారని అన్నారు. పోలీసుస్టేషన్ వారి వశమైనట్లు, వైసీపీదే ఆఫీసు అయినట్లు పోలీసులను తిడుతున్నప్పటికీ నిస్సహాయ స్థితిలో నిలిచిపోయారన్నారు. పది పదిహేను రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో టీడీపీ వారిపై దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. ఓటమి భయంతో వారిలో ఫ్రస్ట్రేషన్ పెరిగిపోయిందని, రానున్నది టీడీపీయేనని, తమ కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. అనంతరం ఆయన అక్కడి నుంచి తన అనుచరులతో వెళ్లిపోయారు.

టీడీపీ వారు వెళ్లిపోయినా వైసీపీ వారు మాత్రం స్టేషన్ ఎదుటే కూర్చుని రెండుగంటల పాటు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా స్టేషన్ వెలుపల అహ్మద్‌బాషా మీడియాతో మాట్లాడారు. టీడీపీ నాయకులు అల్లరి సృష్టిస్తున్నారని, రౌడీషీటర్లు వారి వెంట తిరుగుతున్నారని అన్నారు. తాము ఫ్యాక్షనిజం వదిలామే తప్ప మరిచిపోలేదని హెచ్చరించారు. తమ ముఖ్యమంత్రి శాంతి భద్రతల పరిరక్షణ కోసం దశ, దిశ చేయడం వల్ల తాము ఓపిగ్గా ఉన్నామన్నారు. మీ ఇంట్లోకే వస్తాం.. ఏం పీక్కుంటారో పీక్కోండి అంటూ అసభ్యపదజాలంతో దూషించారు.

హద్దు మీరితే కఠిన చర్యలు : డీఎస్పీ

ఏదైనా సమస్య ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలని హద్దు మీరితే చర్యలు తప్పవని కడప డీఎస్పీ షరీఫ్ హెచ్చరించారు. వ్యక్తిగత గొడవలు, పార్టీలకు అంటకట్టవద్దన్నారు. ప్రజా సమస్యలపై పోరాడాలే తప్ప వ్యక్తిగత విమర్శలకు వెళ్లి సోషల్ మీడియాలో అనవసర పోస్టులు, కామెంట్లు చేసి శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఏ పార్టీ అయినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని, ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్ని పార్టీలు సమన్వయం పాటించాలన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ షరీఫ్

యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా

- రెండు రోజులుగా విజిలెన్సు, పోలీసు అధికారుల దాడులు
- 236 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం



రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన ప్రైవేటు గౌడౌన్‌లు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 8: ప్రొద్దుటూరులో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇక్కడ అధికార పార్టీ అండతో రేషన్ మాఫియా రోజూ లారీల లోడులను ఇతర ప్రాంతాలకు తరలిస్తోంది. రేషన్ మాఫియాలో టోపీబాయ్ కీలక హస్తం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రొద్దుటూరులో రెవెన్యూ అధికారులు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా.. రెండు రోజులుగా విజిలెన్సు మరియు పోలీసు అధికారులు వేర్వేరుగా బియ్యం అక్రమ రవాణాపై దాడులు చేసి దాదాపు 236 బస్తాల రేషన్‌బియ్యం పట్టుకున్నారు. బుధవారం విజిలెన్సు సీఐ రెడెప్ప ఆధ్వర్యంలో మండిబజార్‌లోని ఒక ప్రైవేటు గౌడౌన్ నుంచి 68 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం రమణయ్య యాదవ్ అనే వ్యక్తికి సంబంధించినవని విజిలెన్సు అధికారులు గుర్తించారు. ఆ మేరకు రూరల్ పోలీసు స్టేషన్లో 6ఏ కేసు నమోదు చేశారు. గురువారం ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలోని ఒక ప్రైవేటు గౌడౌన్‌లో అక్రమ రేషన్ బియ్యం ఉన్నట్లు రూరల్ పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో గౌడౌన్‌కు సంబంధించిన వ్యక్తులను పిలిపించి 168 రేషన్‌బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని అక్రమంగా ఇతర ప్రాంతాలకు వాహనాల్లో తరలించడానికి గౌడౌన్‌లో ఉంచారంటూ వరుణ్, శరత్‌యాదవ్ అనే వ్యక్తుల మీద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం నేరుగా ప్రభుత్వ గౌడౌన్ నుంచి వచ్చినట్లు, ప్రభుత్వం సరఫరాచేసే గోతాలలోనే సీల్ చేసినట్లు సమాచారం. ప్రభుత్వ గౌడౌన్ నుంచి ఈ బియ్యాన్ని టోపీబాయ్ ముఠానే ప్రైవేటు గౌడౌన్‌కు తరలించినట్లు సమాచారం, అందువల్లే ఈ అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎటువంటి ఫొటోలను పోలీసులు గానీ రెవెన్యూ అధికారులు గానీ బయటకు వెల్లడించలేదరు. దీన్ని బట్టి అవి నేరుగా ప్రభుత్వ గోదాముల నుంచి అక్రమంగా బయటికి తరలినట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అక్కడ దాదాపు 500 బస్తాలకు పైగా ఉన్నట్లు కొందరు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఏదిఏమైనా ప్రొద్దుటూరులో రేషన్‌బియ్యం అక్రమ రవాణాలో రెవెన్యూ, పోలీసు అధికారుల అండకూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజల రక్తం తాగుతున్న జగన్ ప్రభుత్వం : తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 8: ధరలు, చార్జీలు, పన్నులు పెంచి జగన్ ప్రభుత్వం ప్రజల రక్తాన్ని తాగుతోందని కాంగ్రెస్ రాష్ట్రమీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక 56 నెలల కాలంలో లక్షా నలభై వేల కోట్ల రూపాయల అదనపు భారం ప్రజలపై పడిందన్నారు. ఇందులో మద్యం ద్వారా రూ.16వేల కోట్లు, ఇసుక ద్వారా రూ.10వేల కోట్లు, ఆస్తిపన్ను పెంపుద్వారా రూ.7వేల కోట్లు, డ్రైనేజీ, నీటి పన్ను పెంపు ద్వారా రూ.4వేల కోట్లు, విద్యుత్ చార్జీల పెంపు ద్వారా రూ.30వేల కోట్లు, పెట్రోలు, డీజిల్ ధరలు పెంపు ద్వారా రూ.50వేల కోట్లు ఆర్టీసీ చార్జీల పెంపు ద్వారా రూ.15వేల కోట్లు, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు ద్వారా రూ.1400కోట్లు, రేషన్ సరుకుల ధరల పెంపు ద్వారా రూ.1200కోట్లు ప్రజలపై అదనపుభారం పడిందన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలను సిద్ధ చేయాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి రెవెన్యూ మూడవ దశ సర్వే, ఇనామ్, అసైన్డ్ భూములు, పీ ఆర్ ఆర్డీ, ఉపాధి పనులు, జల్ మిషన్, పేదలందరికీ ఇళ్లు, పట్టాలు- రిజిస్ట్రేషన్లు, వైద్య ఆరోగ్యం, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, డీఆర్వో గంగాధర‌గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష హాజరయ్యారు. సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన తరువాత సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడుతూ రానున్న ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలను మరొకసారి తనిఖీ చేసి సదుపాయాలను సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసుల రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 8: మాదిగ, మాదిగ ఉపకులాలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలకు పాలక, ప్రతిపక్ష పార్టీలు రాజకీయపరంగా తీవ్ర అన్యాయం చేశాయని ధ్వజమెత్తారు. దీంతో మాదిగలు రాజకీయంగా ఇతర వర్గాల కంటే కూడా నేటికీ వెనుకబడే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని బద్వేల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని మాదిగలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. గురువారం ఏపీ ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో స్థానిక స్కౌట్ హాలు సమావేశ మైదానంలో మాదిగ, మాదిగ ఉపకులాల రాజకీయ సమన్యాయ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని 29 అసెంబ్లీ, 4 పార్లమెంట్ ఎస్సీ రిజర్వుడ్ స్థానాలలో మాదిగలకు 17 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాలు కేటాయించాల్సి ఉందన్నారు. అణగారిన కులాలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే ఆయా కులాల్లో అభివృద్ధికి నాంది పలుకుతుందన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి శేఖర్, దళిత నేత ఆర్ఎస్ రాజా, ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, పూతలపట్టు వెంకటేష్, ఎదురూరు బాబు, కళాచైతన్య అధ్యక్షుడు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాదిగలకు సమన్యాయ మహాసభలో మాట్లాడుతున్న సువర్ణరాజు

నిర్వహణకు నిధులేవీ..!

● చేతి నుంచి ఖర్చు చేస్తున్న ప్రధానోపాధ్యాయులు ● జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 8 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం నిర్వహణ నిధులను మంజూరు చేస్తుంది. విద్యాసంవత్సరం ముగింపునకు వస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకూ పాఠశాలల నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలల నిర్వహణకు ఆయా పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. ఆ నిధులను పాఠశాల కరెంటు బిల్లులు, స్టేషనరీ, మైనర్ రిపేర్లు, ఇతర అవసరాల కోసం ఖర్చు చేస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో 20 మందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలకు రూ.10వేలు, 20 మందికంటే ఎక్కువ ఉంటే విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.5వేలు అదనంగా చెల్లిస్తారు. ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.15వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.25వేలు, ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే ఎక్కువ నిధులు విడుదల చేస్తారు. 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాల నిర్వహణ కోసం 40 శాతం నిధులు మాత్రమే మంజూరయ్యాయి. ఆ నిధులు కరెంటు బిల్లులు చెల్లించడానికి కూడా సరిపోవని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలకు కరెంటు బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖాధికారులు ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రొద్దుటూరు మండలం విరాట్ నగర్ ప్రాథమిక పాఠశాలకు కరెంటు సౌకర్యం తొలగించడంతో



ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డు



నాడు-నేడు పనులలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్



పాఠశాలలో ఏర్పాటు చేసిన టీవీ

నిధులు విడుదల చేయాలి



పాఠశాల నిర్వహణకు ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దారుణం. గ్రామీణ పాఠశాలల్లో బిల్లులు కట్టకపోతే విద్యుత్ సౌకర్యం తొలగిస్తామని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పాఠశాలల నిర్వహణకు ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బు వెచ్చిస్తున్నారు. సకాలంలో నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- రవీంద్రుడు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

జేబు నుంచి ఖర్చు చేస్తున్నారు



ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ప్రధానోపాధ్యాయులు తమ జేబు నుంచి డబ్బు ఖర్చు చేస్తున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉండే పాఠశాల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు భారంగా మారింది. ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభమైన వెంటనే నిర్వహణ నిధులు మంజూరు చేయాలి.

- సుబ్బరాజు యాదవ్, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రధానోపాధ్యాయురాలు బకాయిలను చెల్లించి విద్యుత్‌ను పునరుద్ధరింప చేసుకున్నారు. లింగారెడ్డినగర్ పాఠశాలలో కరెంటు కట్ చేస్తామనడంతో నెలనెలా బిల్లులు చెల్లిస్తున్నారు. విద్యుత్ లేకపోతే మంచినీరు, మరుగుదొడ్లలో నీరు లేక విద్యార్థులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. దీంతో ప్రధానోపాధ్యాయులు నెలనెలా తమ జేబు నుంచి కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. నాడు-నేడు పనులు జరిగిన పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్, ఫ్యాన్లు, లైట్లు, టీవీలు, ప్యానెల్ బోర్డుల వినియోగంతో కరెంటు బిల్లులు ఎక్కువగా వస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారుల హెచ్చరికలను ప్రధానోపాధ్యాయులు ఎంఈఓల దృష్టికి తెచ్చినా సొంత డబ్బు చెల్లించాలని సూచించడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్పందించి పాఠశాలలు ప్రారంభమైన వెంటనే నిర్వహణ నిధులు మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

చెక్‌బౌన్స్ కేసుల్లో ఇరువురికి జైలుశిక్ష

నందలూరు, ఫిబ్రవరి 8: నందలూరు జ్యుడీషియల్ పరిధిలోని మూడు వేర్వేరు కేసులకు సంబంధించి జైలుశిక్ష, పరిహారం ఇచ్చేలా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.లత గురువారం తీర్పును వెలువరించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ, జెండామానువీధికి చెందిన అబ్దుల్ గని అనే వ్యక్తి షేక్ నజీర్ అహమ్మద్ వద్ద రూ.2,20,000 అప్పుగా తీసుకొని ఆ మొత్తానికి చెక్కును ఇచ్చారు. ఆ చెక్ బౌన్స్ కావడంతో 6 నెలల జైలుశిక్ష విధించడంతో పాటు చెక్కు విలువ మొత్తాన్ని షేక్ నజీర్ అహమ్మద్‌కు ఇవ్వాలని తీర్పు ఇచ్చారు. అదేవిధంగా మరో కేసులో పాటూరుకు చెందిన షేక్ అబ్దుల్ సత్తార్ వద్ద నుంచి నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన అబ్దుల్ గని రూ.6 లక్షలు అప్పుగా తీసుకుని ఆ మొత్తానికి చెక్కును అందజేశాడు. ఈ చెక్కు బౌన్స్ కావడంతో ఆ వ్యక్తి ఆరు నెలల జైలుశిక్ష విధించడంతో పాటు చెక్కు విలువ మొత్తాన్ని అబ్దుల్ సత్తార్‌కు చెల్లించాలని తీర్పు వెల్లడించారు. అదేవిధంగా డ్రంకెన్ డ్రైవ్‌లో నందలూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి ఒక వ్యక్తికి నాలుగు రోజుల సాధారణ జైలుశిక్షను విధిస్తూ జడ్జి లత తీర్పునిచ్చారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

చాపాడు, ఫిబ్రవరి 8: మండలంలోని రాజుపాళెం గ్రామంలో ఈనెల 7న బుధవారం లక్ష్మీదేవి (36) అనే మహిళ తన ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఆమెకు భర్త నాగేశ్వరరెడ్డి, కూతురు, కుమారుడు ఉన్నారు. లక్ష్మీదేవి తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

సికెదిన్నె, ఫిబ్రవరి 8: అరుణ్‌కుమార్ (19) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలం బండూరు గ్రామానికి చెందిన గుండప్పగారి అమరేష్ కుమారుడు స్థానిక ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతూ స్థానిక ఊటుకూరులో గదిలో ఉండేవాడు. రూములో అయిదుగురు విద్యార్థులు ఉంటుండగా గురువారం మధ్యాహ్నం ఒక్కడే రూముకు వచ్చి ఉరి వేసుకున్నట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తండ్రిపై కొడుకులు, భార్య దాడి

రామాపురం, ఫిబ్రవరి 8: మండలంలోని గువ్వలచెరువులో ఈనెల 5న కుటుంబ సభ్యుల ఘర్షణలో తండ్రిపై కొడుకులు, భార్య దాడి చేయడంతో రెండు తొడ భాగాలు విరిగినట్లు బాధితుడు షేక్ షంషీర్‌బాషా కడప రిమ్స్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. చింతకొమ్మదిన్నె మండలం బోడెద్దులపల్లెకు చెందిన షేక్ షంషీర్‌బాషాకు రామాపురం మండలం గువ్వలచెరువుకు చెందిన హసీనాబేగంతో కొన్నేళ్లక్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు హనీఫ్, హుస్సేన్‌బాషాలు ఉన్నారని, ఆయన భార్య పిల్లలు గువ్వలచెరువులో కాపురం ఉన్నారని తెలిపారు. ఈనెల 5న గువ్వలచెరువుకు భార్య, పిల్లలు వద్దకు రాగానే వారు దాడి చేసి రెండు తొడలు విరగ్గొట్టడంతో తీవ్రగాయాలైనట్లు వివరించారు. స్థానికుల సాయంతో బాధితుడిని కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసుల ద్వారా అందిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు జవహర్ నవోదయలో ప్రవేశ పరీక్ష

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 8: రాజంపేట మండలం నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో చేరేందుకు ఈనెల 10వ తేదీ ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిమితి సీట్ల కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, 9వ తరగతి ప్రవేశానికి 956 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని, అలాగే 11వ తరగతిలో పరిమిత సీట్లకై 434 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. 9వ తరగతి విద్యార్థులకు రాజంపేట పట్టణంలో 4 పరీక్షా కేంద్రాలను, 11వ తరగతి విద్యార్థులకు నవోదయ విద్యాలయంలో పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులందరూ నవోదయకు సంబంధించిన వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9494767721, 8096329332, 8309970824 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులు

● రైతులపై ఎస్ఐ ఆగ్రహం ● ఎస్ఐ తీరుపై ఆగ్రహించిన రైతులు, స్థానికులు



ఎస్ఐతో మాట్లాడుతున్న రైతులు

వీరబల్లి, ఫిబ్రవరి 8: మాండవ్యనదిలో ఇసుక రీచ్‌లకు అనుమతులు ఒకచోట ఉంటే మరోచోటి నుంచి ఇసుకను అక్రమంగా తరలించడానికి వచ్చిన ప్రైవేటు సంస్థ ప్రతినిధులను స్థానికులు, రైతులు గురువారం అడ్డుకున్నారు. వీరబల్లి సమీపంలో బొంగావాండ్లపల్లె వద్ద ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయడానికి వచ్చిన కంపెనీ ప్రతినిధులను రైతులు అడ్డుకుని అనుమతి లేకుండా ఇక్కడి నుంచి ఇసుక ఎలా తరలిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడికి వచ్చిన వీరబల్లి ఎస్ఐ చంద్రమోహన్ ఆ కంపెనీ వారికి అనుమతులు ఉన్నాయని, మీరెవరు అడ్డుకోవడానికి అని రైతులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి ఇసుక తరలిస్తే సమీప రైతుల బోర్లలో నీరు అడుగంటడంతో పాటు గ్రామాల్లోని తాగునీటి పథకాల్లో నీరు అడుగంటి నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. దీంతో మరింత రెచ్చిపోయిన ఎస్ఐ మాండవ్యనదిలో బోర్లు ఎవరు వేయమన్నారు.. మాండవ్యనదిని ఏమైనా రైతులకు రాయించారా అని రైతులతో ఇష్టానుసారంగా మాట్లాడడంతో పాటు ఇసుక తరలింపును ఎవరు అడ్డుకుంటారో చూస్తానని వారిపై చిందులేశారు. అనంతరం టీడీపీ నాయకులు టి.శ్రీధర్ రెడ్డి, తుమ్మల రమేశ్, ఆంజనేయులురెడ్డిలు సంఘటనా స్థలానికి వచ్చి ఇక్కడ రీచ్ పెట్టడానికి ఒప్పుకోమని ఖరాకండిగా చెప్పారు. వెంటనే అక్కడ ఉన్న కొందరు జడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాజంపేట నియోజకవర్గ నాయకుడు మదన్‌రెడ్డిలకు ఇక్కడ జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా తెలిపారు. వెంటనే వారు కలెక్టర్‌కు, ఎస్పీలకు ఫోన్ చేసి అడగ్గా తాము అక్కడ ఇసుక రీచ్‌కు అనుమతులు ఇవ్వలేదని చెప్పారని అక్కడున్న రైతులు తెలిపారు.

బడ్జెట్‌లో అధికభాగం సీమ ప్రాజెక్టులకు కేటాయించాలి

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 8: ప్రాంతీయ అసమానతలు తొలగాలంటే సాగునీటి ప్రాజెక్టుల బడ్జెట్‌లో సింహభాగం రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐఎంఏ హాలులో చర్చా వేదిక నిర్వహించారు. శివశంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి దశరథరామిరెడ్డి మాట్లాడారు. రాయలసీమ జిల్లాల అభివృద్ధికి సాగునీరు ఎంతో అవసరమని, ఆ దిశగా పాలకులు పనిచేయకపోవడం వల్లనే సీమ ప్రాంతం నేటికీ వెనుకబడే ఉందన్నారు.



చర్చావేదిక నుద్దేశించి మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

మధ్యాంధ్రలో 32 లక్షల ఎకరాల సాగు యోగ్యమైన భూమి ఉంటే అందులో 24 లక్షల ఎకరాలకు ప్రభుత్వాలు నీరు అందించాయన్నారు. రాయలసీమలో 90 లక్షల ఎకరాల వ్యవసాయ యోగ్యమైన భూమి ఉంటే కేవలం 8 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడం సరైంది కాదన్నారు. 40 సంవత్సరాలుగా ఈ ప్రాంత సస్యశ్యామలం కోసం చేపట్టిన తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలుగోడు, ప్రాజెక్టులు ఏ దుస్థితిలో ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. మూడు టీఎంసీల నీరు సామర్థ్యం గల అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గల సమస్యను 5 సంవత్సరాలైనా గాలికి వదిలేశారన్నారు.

సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, నాయకులు కె.ఆంజనేయులు, ఓబయ్య, దేవరశ్రీకృష్ణ, ఓపీడీఆర్ అనంతపురం జిల్లా నాయకులు శ్రీనివాసులు, శివశంకర్‌గౌడ్, జి.పుల్లారెడ్డి, పి.శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుంకన్న, గంగిరెడ్డి, రామకృష్ణారెడ్డితో పాటు పలువురు రైతు సంఘాల, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు పరీక్షల భయాన్ని విడనాడాలి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 8 : పదో తరగతి విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని విడనాడాలని సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కృషి, పట్టుదల, తపనతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. గురువారం కడప నగరం జయనగర్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి భావిభారత పౌరులుగా, సమాజ నిర్దేశకులుగా ఉన్నత స్థానాన్ని అధిరోహించడానికి చదువుతో పాటు సంస్కారం, ఆటలు, పాటలు మాటల్లో మంచి నైపుణ్యం పొందాలన్నారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో పరీక్షల ఫోబియాను వదిలిపెట్టి మంచి మార్కుల కోసం ప్రయత్నం చేయాలని చెప్పారు. ప్రతి విద్యార్థి లక్ష్యసాధన కోసం ప్రయత్నం చేస్తే సాధించలేనిది లేదని సాధించడానికి వ్యక్తిత్వాన్ని మనస్తత్వాన్ని అలవరచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి, ఉపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సమగ్రశిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

వెట్టిచాకిరీని నిర్మూలిద్దాం

కార్మిక శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 8 : వెట్టిచాకిరి చట్ట విరుద్ధమని కడప జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్ నాయక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరి 9న వెట్టిచాకిరి నిర్మూలన దినంగా ప్రకటించిందని తెలిపారు. ఇందులో భాగంగా వెట్టిచాకిరి నిర్మూలన చట్టంపై కార్మికులకు అవగాహన కలిగించేందుకు గురువారం కడప పాత రిమ్స్‌లో గల కార్మికశాఖ కార్యాలయంలో వెట్టిచాకిరికీ వ్యతిరేకంగా సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు వెట్టిచాకిరి పనిలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతున్న వారిని రక్షించాలన్నారు. ఎలాంటి నేరాలు జరగకుండా నిర్మూలించేందుకు అందరితో కలిసి అవగాహన కల్పించాలన్నారు. వెట్టిచాకిరి నిర్మూలన చట్టం అమలు ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను వెట్టిచాకిరి రహిత రాష్ట్రంగా మార్చాలన్నారు. తద్వారా ప్రజలందరూ ఆరోగ్యంగా సంపన్నమైన జీవితం గడపగలరని తెలిపారు. ఎవరైనా వెట్టిచాకిరి వ్యవస్థలో చిక్కుకుని ఉంటే తమకు సమాచారం అందించాలని అటువంటి వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్‌నాయక్

జనసేనలో చేరిన తుంగా రమణయ్య

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 8 : విజయవాడ జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో కడప విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టరు, ప్రముఖ రియల్టర్ తుంగా రమణయ్య జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. ఆయనకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, టీడీపీ-జనసేన బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. రమణయ్య మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, అభ్యర్థుల విజయానికి కష్టపడి పనిచేస్తానని తెలిపారు.



తుంగా రమణయ్యకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్‌కళ్యాణ్

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడండి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 8: వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు రూపొందించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేలా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. జగనన్న లేఅవుట్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై హౌసింగ్ పీడీతో సమీక్షించారు. ఇంకా ప్రారంభం కాని ఇళ్లు, బీబీఎల్ దశలో ఉన్న వాటిని బీఎల్ స్థాయికి తీసుకురావాలని ఇందుకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు తగిన ఆదేశాలు జారీ చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు ఇవ్వాలి: ఏఐటీయూ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 8 :జగనన్న ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మద్దిలేటి, ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కామాక్షమ్మ డిమాండ్ చేశారు. గురువారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధకు వారు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికైనా వారికి ఇస్తామన్న రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు మేరీ, జిల్లా సహాయ కార్యదర్శి పార్వతి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

కడప (క్రైం), ఫిబ్రవరి 8 : కడప నగరం తారకరామానగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. తారకరామానగర్‌కు చెందిన సంధ్యారాణి వన్‌టౌన్ సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతుంది. ఈనెల 6న కాలేజీకి వచ్చి మధ్యలో వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. విద్యార్థిని తల్లి సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇరువర్గాల దాడి - కేసు నమోదు

● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తహసీల్దారు


పబ్బాపురం వద్ద ఉపాధ్యాయ ప్లాట్లను పరిశీలిస్తున్న తహసీల్దారు, తదితరులు

సీకేదిన్నె, ఫిబ్రవరి 8: చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురం సమీపంలోని చెర్లోపల్లె లేవుట్ వద్ద బుధవారం జరిగిన ఘటనపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కేసు నమోదు చేశామన్నారు. దీంతో నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలంటూ 300 మందికిపైగా ఉపాధ్యాయులు కడప ఆర్డీఓను కోరారు. దీంతో గురువారం తహసీల్దారు భాగ్యలక్ష్మి ప్లాట్ల వద్దకు వచ్చి పరిశీలించారు. అనంతరం ఇరువురికి వారి వద్ద ఉండే ఆధారాలు తీసుకొచ్చి చూపాలని, ఆధారాలను బట్టి పరిశీలిస్తామన్నారు. తహసీల్దారు వెంట సర్వేయర్లు, వీ ఆర్వో, రెవెన్యూ సిబ్బంది, సీఐ శంకర్ నాయక్, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భద్రత ఏర్పాటు చేశారు.

'టీడీపీ విజయానికి కృషి చేస్తాం'


పుత్తాను కలిసిన శాలివాహన సంఘం నేతలు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 8: తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేస్తామని జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు చాగలమర్రి వెంకటరమణ అన్నారు. గురువారం కడప నగరంలోని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి తమ మద్దతు ప్రకటించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రానున్న ఎన్నికల్లో ప్రతి గ్రామ పంచాయితీలో టీడీపీ గెలుపు కోసం శ్రమిస్తామన్నారు. శాలివాహనులంతా టీడీపీ వైపే ఉన్నారన్నారు. అలాగే కమలాపురం నియోజకవర్గంలో పుత్తా నరసింహారెడ్డి గెలుపుకోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ నేత చలపతి, ఓబులేసు, లక్ష్మయ్య, సత్యనారాయణ, శివ, ఈశ్వరయ్య వెంకటసుబ్బయ్య సునీల్ నాగరాజు వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

'ప్రాణరక్షణ కల్పించండి'

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 8: టీడీపీ కడప నియోజకవర్గ నాయకులు, మహిళానాయకురాళ్ల బారి నుంచి తనకు ప్రాణరక్షణ కల్పించాలని వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ సునీతారెడ్డి జిల్లా అధికారులను కోరారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల తనకు కొంతమంది నా సెల్‌కు ఫోన్‌లు చేస్తూ బెదిరిస్తున్నట్లు వెల్లడించారు. వైసీపీ నగర అధ్యక్షురాలు వెంకటసుబ్బమ్మ, నాయకురాళ్లు రాములమ్మ, సుశీలమ్మ, శ్రీదేవి, నారాయణమ్మ, శివమ్మ, నిర్మల, తులశమ్మ, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు వెంటనే వేతనాలు చెల్లించాలి

● జిల్లా స్ట్రగుల్ కమిటీ మహా ధర్నాలో సీఐటీయూ డిమాండ్


విద్యుత్ జిల్లా స్ట్రగుల్ కమిటీ మహా ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 8:రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, విద్యుత్ ఉద్యోగులు గురువారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.సుబ్బిరెడ్డి, కామనూరు శ్రీనివాసులరెడ్డిలు మాట్లాడారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్టు కార్మికులతోనే భర్తీ చేయాలన్నారు. ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించేందుకు వెంటనే నియామకాలు చేపట్టాలని కోరారు.
కాంట్రాక్టు కార్మికుల నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ మేరకు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. డిస్కం అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ మహాధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయబ్ రసూల్‌తో పాటు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగసుబ్బయ్య, శ్రీహరి, డివిజన్ నాయకులు మైదుకూరు డివిజన్ నాయకులు రామ్మోహన్, నాగమల్లయ్య, రాజంపేట డివిజన్ నాయకులు ఎరికలరెడ్డి, డివిజన్ నాయకులు ఏవీ రమణ, అమర్‌నాథరెడ్డి, సుబ్రమణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతికి బాటలు వేస్తున్న మోదీ: బీజేపీ

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 8: ప్రధాని మోదీ సారథ్యంలో మన దేశం అన్ని రంగాలలో ప్రగతిపథం వైపు వడివడిగా అడుగులు వేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. కొన్నేళ్లుగా మన దేశంపై పక్కదేశాలైన పాకిస్థాన్, చైనా దేశాలకు వెన్నులో వణుకుపుట్టేలా చేయడంలో నరేంద్ర మోదీ చాణక్యం అనితర సాధ్యమన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు నిత్యం తపనపడుతూ అత్యధిక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసి తద్వారా ప్రజల ఆదరాభిమానాలు పొందు తున్నారన్నారు. గత 10 సంవత్సరాల పాలనలో దేశంలోని గ్రామీణ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా చేసిన సేవలను గుర్తుచేయడానికి వీలుగా పల్లెకుపోదాం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆ మేరకు గురువారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పల్లెకు పోదాం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా మన రాష్ట్రంలో 2.68 కోట్ల మందికి ఉచితంగా రేషన్ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 1.32 కోట్ల మందికి పైగా పేదలకు జన్‌ధన్ ఖాతాలను తెరిపింపచేసి బ్యాంకింగ్ వ్యవస్థకు కేంద్రం అనుసంధానం చేసిందన్నారు.బీజేపీ నాయకులు మునగా సతీష్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బత్తల పవన్‌కుమార్ పాల్గొన్నారు.

'బుగ్గన బడ్జెట్ అంతా అంకెల గారడీ'

చెన్నూరు, ఫిబ్రవరి 8 : రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి అంచనాలు కొండంత, ఖర్చు పెట్టడం రవ్వంత అన్నచందగా అంకెల గారడీ బడ్జెట్‌గా ఉందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్ అన్నారు. చెన్నూరు టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్ వల్ల రాష్ట్ర ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాజాహుసేన్, బీసీ సెల్ అధ్యక్షుడు కుందేటి క్రిష్టయ్య, సుభాన్, మంజూరు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'టికెట్ల కేటాయింపులో బలిజలకు ప్రాధాన్యమివ్వాలి'


హరిరామజోగయ్యను కలిసిన కాపు సంక్షేమ సంఘం నేతలు

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 8 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో బలిజలకు ప్రాధాన్యమివ్వాలని కాపునాడు రాష్ట్ర నేత హరిరామజోగయ్యకు కడప జిల్లా కాపు నాయకులు విన్నవించారు. గురువారం ఆయన నివాసంలో కలిసి జిల్లాలో టికెట్ల కేటాయింపు, సామాజిక సమీకరణాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలో అధిక సంఖ్యలో కాపులు ఉన్నప్పటికీ వారి రాజకీయ ప్రాతినిధ్యం మాత్రం చాలా తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రతి ఎన్నికల్లో బలిజలను ఓట్ల కోసం వాడుకోవడం తప్ప సీట్లు ఇవ్వడంలో మాత్రం అన్ని రాజకీయ పార్టీలు అన్యాయంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో కడప, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, బద్వేలు తదితర నియోజకవర్గాల్లో బలిజల ఓట్లు అత్యధికంగా ఉన్నాయని, కానీ ఇక్కడ మాత్రం బలిజలకు పోటీ చేసే అవకాశం రావడం లేదన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లాలని హరిరామజోగయ్యను కోరారు. ఈ కార్యక్రమంలో గడేకుల వెంకటరమణ, కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాపు యువసేన జిల్లా అధ్యక్షుడు మాలే శివ, రెడ్డిపల్లె మహేష్‌బాబు, నగర యువజన అధ్యక్షుడు గంధా వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలి : ఆర్డీఓ


మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: కడప నియోజకవర్గ పరిధిలోని 268 పోలింగ్ కేంద్రాల్లో తుది జాబితా నాటికి 274226 మంది ఓటర్ల నమోదు పారదర్శకంగా జరిగిందని, ఇందులో ఏవైనా అభ్యంతరాలుంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కడప ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. కడపలోని ఆర్డీఓ కార్యాలయంలోని తన చాంబరులో కడప నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాపై కడప తహసీల్దారు శివప్రసాద్‌తో కలసి ఆర్డీఓ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 274226 మంది ఉండగా అందులో పురుష ఓటర్లు 133890 మంది, మహిళలు 140248, ఇతరులు 88 మంది ఉన్నారు. గత నెల తుది జాబితా ప్రకటించిన నాటి నుండి 5 వతేదీ వరకు ఫారం-6,7,8లు క్లైయిమ్స్ 1004గా ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న మొత్తం కలుపుకొని ఫారం 6కు సంబంధించి 2265, ఫారం-7కు 1864,ఫారం-8కు 1305 కలపి 5434 ఉన్నాయన్నారు. ఓటర్ల జాబితా వివరాలను రాజకీయ పార్టీలకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా ఏవైనా అభ్యంతరాలుంటే తగిన ఆదారాలతో వెంటనే ఆన్లైన్‌లో క్లైయిమ్స్‌ను పెట్టినచో విచారించి తదుపరి చర్యలు తీసుకొని, పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందించడం జరుగతోందని ఆర్డీవో పేర్కొన్నారు. తెలిపారు.

పకడ్బందీగా పీజీ సెమిస్టరు పరీక్షలు: వీసీ


పరీక్షలను పరిశీలిస్తున్న వైస్ చాన్సలర్ చింతా సుధాకర్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 8 : పీజీ సెమిస్టరు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్ తెలిపారు. గురువారం వైవీయూ పరిధిలో జరుగుతున్న పీజీ పరీక్షలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్, సైన్స్‌బ్లాక్‌లో జరుగుతున్న ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంపీఈడీ మొదటి పీజీ సెమిస్టరు పరీక్షలను పరిశీలించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎస్.ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు.

వైవీయూలో బాలికలకు నూతన మెస్ ప్రారంభం

వైవీయూ బాలికల వసతి గృహంలో నూతన మెస్‌ను గురువారం వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి ప్రారంభించారు. 600 మంది విద్యార్థినులు వసతిగృహంలో ఉన్నారని ఆయన తెలిపారు. వారికి ఇప్పటికే ఒక మెస్ ఉండగా మరింత సౌకర్యార్థం 300 మంది విద్యార్థులు కూర్చుని భోంచేసేలా మరో మెస్‌ను ఏర్పాటు చేశామన్నారు.

రిమ్స్ వైద్యుడికి బంగారు పతకం


వైద్యుడిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 8 : కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈఎన్‌టీ విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ శ్రవణ్‌కుమార్‌కు 2020 సంవత్సరం ఎంఎస్ పరీక్షలో అత్యాధునిక ప్రతిభ కనబర్చినందుకు బంగారు పతకం లభించింది. విజయవాడ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో ఈనెల 6న స్నాతకోత్సవం నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేదుల మీదుగా పతకం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను రిమ్స్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అభినందించారు. ఈఎన్‌టీ విభాగం అధిపతి డాక్టర్ భాస్కరన్ మాట్లాడుతూ పీజీ విద్యార్థులు డాక్టర్ శ్రవణ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రవణ్ తనకు ఈ గౌరవం దక్కడానికి కారకులైన తన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌టీ ఉపాచార్యులు డాక్టర్ సుధ, డాక్టర్ కిశోర్, సహాయ ఆచార్యులు డాక్టర్ ఫరూక్, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు.

అవయవదానంపై అపోహలు తొలగించేందుకు కృషిచేయాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్, అధ్యాపకులు

వేంపల్లె, ఫిబ్రవరి 8: సమాజంలో ప్రజలకు అవయవదానంపై ఉన్న అపోహలు తొలగించేందుకు ప్రతి సర్వీస్ వలంటీర్ కృషిచేయాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త అన్నారు. గురువారం ట్రిపుల్‌ఐటీలో ఎన్ఎస్ఎస్ 9,13 ప్రోగ్రాం అధికారులు అనిల్‌కుమార్‌రెడ్డి, అమరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డైరెక్టర్ సూచించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు ఇందుమతి,అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫైర్ సర్వీస్ క్రీడల్లో జిల్లాకు పతకాలు


పతకాలు సాధించిన ఫైర్ సిబ్బందితో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ధర్మారావు

కడప (క్రైం), ఫిబ్రవరి 8 : జాతీయస్థాయి ఫైర్ సర్వీసు క్రీడల్లో అత్యంత ప్రతిభ చూపి రాష్ట్రానికి 20 పతకాలు రాగా, జిల్లాకు 8 పతకాలు సాధించిన జిల్లా అగ్నిమాపక అధికారులు, సిబ్బందిని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఐ.ధర్మారావు అభినందించారు. గురువారం ఆ శాఖ కార్యాలయంలో జాతీయస్థాయి ఫైర్ సర్వీసు క్రీడా పోటీల్లో పాల్గొని 8 పతకాలు సొంతం చేసుకున్న ఫైర్ అధికారులు, సిబ్బంది జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిని కలిశారు. ఆయన నుంచి ప్రశంసలు, అభినందనలు స్వీకరించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ తరపున పాల్గొన్న ఫైర్ అధికారులు, సిబ్బంది విశేష ప్రతిభ చూపి 2 బంగారు పతకాలు, ఆరు వెండి పతకాలు, 12 కాంస్య పతకాలను సాధించడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. జిల్లాకు చెందిన ఏడీఎఫ్ఓ బసిరెడ్డి, ఫైర్ సిబ్బంది శ్రీనివాసులరెడ్డి, చిన్ను, సంజీవరెడ్డి టీమ్ 1 బంగారు పతకం, 2 వెండి పతకాలు, 2 కాంస్య పతకాలు సాధించడం అభినందనీయన్నారు.

వచ్చే ఎన్నికల్లో అధికారం టీడీపీదే

● 100 కుటుంబాలు టీడీపీలో చేరిక : పుత్తా


విశ్వనాథపురంలో టీడీపీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి

సీకేదిన్నె, ఫిబ్రవరి 8: రాబోయే ఎలక్షన్లలో తెలుగుదేశం పార్టీ విజయఢంకా మోగించి అధికారాన్ని సొంతం చేసుకుంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కార్పోరేషన్‌లో విలీనమైన 18వ డివిజన్ పరిధిలో గురువారం బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా విశ్వనాథపురం, ఆర్‌టీకేనగర్, వాల్మీకినగర్, స్వామినగర్, జీవీనగర్, సాయిప్రతాప్‌నగర్‌లో ఇంటింటికి తిరిగి టీడీపీ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ 6 పథకాలు ప్రతి ఇంటికి వివరిస్తూ మహిళలను, రైతులను చైతన్యపరుస్తూ ముందుకు సాగారు. ఇంటింటా మహిళలు అపూర్వ ఆదరణ కనపరిచారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతోపాటు ఉచిత గ్యాస్, సంవత్సరానికి ఉచితంగా మూడు సిలిండర్లు, కుటుంబంలో ఎంతమంది చదువుతున్నా అందరికి అమ్మవొడి, 18 సంవత్సరాలు దాటిన మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించడం జరుగుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథపురంలో నిత్య, వెంకటరమణ ఆధ్వర్యంలో వంద కుటుంబాలు వైసీపీ పార్టీ నుండి టీడీపీ కండువా వేసుకుని పుత్తా సమక్షంలో తెలుగుదేశంలోకి చేరారు. కార్యక్రమంలో పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డి, పుత్తా సాయినరసింహారెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో టీడీపీలోకి చేరికలు


47వ డివివజన్‌లో టీడీపీలో చేరిన ముస్లింలు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 8 : కడప నగరం 47వ డివిజన్‌లో అధిక సంఖ్యలో ముస్లింలు గురువారం టీడీపీలో చేరారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డిలు వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కటింగ్ బాషా దౌర్జన్యాలు మితిమీరుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. మీ దౌర్జన్యాలకు ఎవరూ భయపడరని, ప్రజలు కూడా ఒక నిర్ణయానికి వచ్చారన్నారు.ఓడిపోతున్నారనే భయంతో మా కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, జనార్థనరెడ్డి, జిలానీబాషా, వేణు, ఖాజాపీర్, హుసేన్‌రెడ్డి, హుసేన్, ఖాదర్‌బాషా, చిన్న ఖాదర్, సుభాన్‌బాసా, ఇబ్రహీం, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కడప ఉక్కును సాధించుకుందాం: డీవైఎఫ్ఐ


నిరసన చేపట్టిన డీవైఎఫ్ఐ నాయకులు

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 8 : కడప ఉక్కును కేంద్ర ప్రభుత్వం విస్మరించడాన్ని నిరసిస్తూ.. 'కడప ఉక్కును సాధించుకుందాం' అంటూ గురువారం దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఉక్కును పూర్తిగా విస్మరించారన్నారు. చట్టబద్ధంగా రాసుకున్న కడప ఉక్కు హామీని ఎందుకు అమలు చేయడంలేదని కేంద్రాన్ని ప్రశ్నించినట్లు తెలిపారు. కనీసం చివరి బడ్జెట్ సమావేశాల్లో అయినా పార్లమెంటులో కడప ఉక్కు నిధులు కేటాయిస్తారని అనుకుంటే బీజేపీ ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు మరోసారి ముఖానికి మసి పూసిందన్నారు. వైసీపీ, ప్రతిపక్ష టీడీపీలు రెండూ గళమెత్తకపోవడం సిగ్గుచేటన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరు కడప ఉక్కు పరిశ్రమ పూర్తిచేస్తామని స్పష్టమైన హామీ ఇస్తారో వారికే మద్దతు ఉంటుందన్నారు. లేదంటే ఓటు ద్వారా తగిన రీతిలో బుద్ధిచెబుతారని హెచ్చరించారు.జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలను మెగా డీఎస్సీలో ప్రకటించాలి

● లేదంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమం: ఏబీవీపీ


ధర్నాలో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 8 : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 27వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ వెంటనే విడుదల చేయాలని, లేకుంటే ఉద్యమం తప్పదని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లిఖార్జున డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. గురువారం కడప నగరం వన్‌టౌన్ సర్కిల్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు టెట్, డీఎస్సీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. టెట్ ఫలితాలు వెంటనే విడుదల చేసి అర్హులకు అవకాశం ఇవ్వాలని, మినీ డీఎస్సీ వద్దు, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 27వేల పోస్టులతో కూడిన మెగా డీఎస్సీ కావాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యులు పెంచలయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యులు మాణిక్యంరాజు, శంకర్, హరి, నందతో పాటు పలువురు పాల్గొన్నారు.

టెక్నికల్ కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు మెండు

పులివెందుల, ఫిబ్రవరి 8: టెక్నికల్ కోర్సుల ద్వారా ఉన్నత విద్య మరియు ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయని తొండూరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాల ప్రిన్సిపల్ ఉషారాణి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన తొండూరులో విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రాన్ని మరియు ఇంటర్‌నెట్ సెంటర్‌ను సందర్శించారు. ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌రెడ్డి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానం మరియు డిస్ట్రిబ్యూట్ చేసే విధానాన్ని విశ్లేషించారు.

లోపాలు కప్పిపుచ్చుకునేందుకే పదవీ విరమణ ఉపాధ్యాయుల కొనసాగింపు: ఒంటేరు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 8: విద్యావ్యవస్థలో ఏర్పడిన లోపాలను కప్పిపుచుకునేందుకే పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులను బోధన కోసం కొనసాగిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో వేలాది ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తిందన్నారు. అంతేకాకుండా పదవీ విరమణ చేసిన వారికి ఆర్థిక బకాయిలు ఇవ్వాల్సి వస్తుందని ప్రభుత్వం వారిని కొనసాగిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఇది వరకే పదవీ విరమణ వయసు 2 సంవత్సరాలు పెంచడం వల్ల వారు ప్రభుత్వం పెట్టే ఒత్తిళ్లను తట్టుకోలేకున్నారని, పలువురు గుండెపోటుతో చనిపోయారన్నారు.

రైతాంగ సమస్యలపై కలెక్టరేట్ వద్ద నిరసన

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 8 : ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, పోతిరెడ్డి మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అలాగే కరువు, తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్న డిమాండ్‌తో నిరసన చేపట్టామన్నారు.

మాదిగలపై సవతితల్లి ప్రేమ తగదు: ఎమ్మార్పీఎస్

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 8: మాదిగలపై సవతితల్లి ప్రేమ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి తగదని దండోరా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంద క్రిష్టయ్య మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మేరకు గురువారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం ముఖ్యమంత్రి స్వంత జిల్లాలో గల యస్సీ రిజర్వుడు నియోజకవర్గాలను కూడా (బద్వేల్- రైల్వేకోడూరు) మాల సామాజిక వర్గాలవారికే కేటాయించడం సరైందికాదన్నారు.
ఇదిలావుండగా గత 2019లో జరిగిన ఎన్నికల్లో కూడా మాదిగలకు పలు హామీలిచ్చిన జగన్‌రెడ్డి ఏ ఒక్క హామీని నెరవేర్చకపోగా మాలలకు 21 అసెంబ్లీ మరో 3 పార్లమెంట్ స్థానాలను కట్టబెట్టి, మాదిగలకు తూతూ మంత్రంగా 8 అసెంబ్లీ, 1 పార్లమెంట్ స్థానాలు మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు.

ఇష్టంతో చదివి లక్ష్యాలను సాధించాలి

బద్వేలు, ఫిబ్రవరి 8: విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంతో చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని హెచ్‌డబ్ల్యుఓ రామయ్య, ఏఎస్‌డబ్ల్యుఓ మధుసూదన్ రెడ్డిలు పేర్కొన్నారు. వివిధ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ప్రేరణ శిక్షణ తరగతులను గురువారం బాలుర వసతిగృహం 2లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులు, గురువులకు, హాస్టల్‌కు మంచి పేరు తీసుకురావాలన్నారు. వార్డన్లు సుభాష్, హరిక్రిష్ణ, లక్ష్మీదేవి, బాలమ్మ, బాలరాజు, సుదాకర్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

బద్వేలు, ఫిబ్రవరి 8: కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఎన్‌డీ విజయజ్యోతి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్ బీ బంగ్లాలో ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం ప్రత్యేకహోదాపై ఉంటుందని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ప్రత్యేక హోదాపై జగన్ చేతులెత్తేసి.. ఇప్పుడు ప్రజలను మభ్యపెడుతున్నారని ఆమె దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకులు సత్తార్, అచ్యుతరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

బద్వేలు, ఫిబ్రవరి 8: రోడ్డు భద్రతా నియమ నిబంధనలను ఆటో డ్రైవర్లు కచ్చితంగా పాటించాలని ఎంవీఐ వి.శేఖరరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంవీఐ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఖచ్చితంగా లైసెన్స్ కలిగి, యూనిఫారం ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను తీసుకెళ్ల రాదని, డ్రైవర్ సీట్‌లో ప్రయాణీకులను కూర్చోబెట్టరాదని, ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని, మద్యం సేవించి వాహనాలు నడప రాదన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

ఖాజీపేట, ఫిబ్రవరి 8: మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో గురువారం రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలన్నారు. సీనియర్ మేనేజర్ అరుణ్‌రాజ్, టోల్‌ప్లాజా మేనేజర్ చిరంజీవినాయుడు, మదన్‌మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

42 మద్యం బాటిళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 8: ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం బాటిళ్లు తీసుకెళుతున్న తిరుపతయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 42 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం తమకు అందిన సమాచారం మేరకు అంబేడ్కర్ సర్కిల్ వద్ద చిన్నయరసాలకు చెందిన బెల్టుషాపు నిర్వాహకుడు తిరుపతయ్య మద్యం తీసుకెళుతుండగా అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చాపాడులో..

చాపాడు, ఫిబ్రవరి 8: మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన 40 మద్యం బాటిళ్లను గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. గ్రామం బయట ఆయన మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అట్లూరులో...

అట్లూరు, ఫిబ్రవరి 8: మండలంలోని ఎస్.వెంకటాపురం గ్రామానికి చెందిన నడిపి ఓబులేసు అక్రమంగా 40 మద్యం సీసాలను రవాణా చేస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ కేసీ రాజు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండకు వెళ్లిన దీక్షాదారులు

మైదుకూరు, ఫిబ్రవరి 8 : 41 రోజుల పాటు నియమ నిష్టలతో దీక్ష పూనిన వాసవాంబలు ఇరు ముడితో గురువారం అమ్మవారి జన్మస్థలమైన పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక అమ్మవారుశాలలో ఆలయ అర్చకులు సత్యకుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వాసవీమాలాధారులకు ఇరుముడులు కట్టారు. ప్రత్యేక వా హనంలో పెనుగొండకు బయలుదేరి వెళ్లారు. ఈనెల 11న వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా పెనుగొండలో నిర్వహించే పూజల్లో మాలాదారులు పాల్గొంటారు.

ప్రొద్దుటూరులో టీడీపీ గెలుపు ఖాయం



కొత్తపల్లె పంచాయతీలో ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 8: ప్రొద్దుటూరులో వైసీపీ అరాచకాల నుంచి ప్రజలు విముక్తిని కోరుకుంటున్నారని.. టీడీపీ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక కొత్తపల్లె పంచాయతీలోని గ్రీన్ లాండ్స్ ఏరియాలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చేపట్టారు. కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి, టీడీపీ నేతలు నాగమునిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్లు సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ పేట రమణ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంనగర్ ప్రచారంలో పాలొన్న మౌనికారెడ్డి

ఇంటింటికి టీడీపీ మ్యానిఫెస్టో

ఇంటింటికి టీడీపీ మ్యానిఫెస్టోను తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రతికార్యకర్త పని చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీ మణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక 37 వార్డు శ్రీరాం నగర్‌లో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి సోదరి హరితారెడ్డి, 37 వార్డు ఇన్‌చార్జ్ పొట్టిపాటి గంగాదర్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక



బి.కొట్టాలపల్లెలో టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం, ఫిబ్రవరి 8: మండలంలోని బి.కొట్టాలపల్లె గ్రామానికి చెందిన 20కుటుంబాలు గురువారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో విశ్వనాథరెడ్డి, శివారెడ్డి, మైసూరారెడ్డి, శివశంకర్‌రెడ్డి, అంకిరెడ్డి, జనర్దాన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు. వీరికి పార్టీ కండువా కప్పి భూపేశ్ టీడీపీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో భూపేశ్ గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని పార్టీలో చేరినవారు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి ,టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి టీడీపీ ప్రాధాన్యం



బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో సరస్వతీ, జ్యోతి

ముద్దనూరు ఫిబ్రవరి 8: మహిళల సంక్షేమానికి చంద్రబాబునాయుడు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని.. సీఎంగా చంద్రబాబునాయుడును చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి తల్లి చదిపిరాళ్ల సరస్వతి, సతీమణి జ్యోతి పేర్కొన్నారు. మండల పరిధి మాన్నగారిపల్లె, కోనాపురం గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు ఆడబిడ్డనిధి ద్వారా నెలకు రూ.1500, దీపం పథకం కింద కుటుంబానికి ఉచితంగా 3గ్యాస్ సిలెండర్‌లు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు శివరామిరెడ్డి, రామాంజనేయరెడ్డి, రమేష్‌నాయుడు, కొండయ్య, చిన్నమాబు, దస్తగిరి, పీరయ్య, రాముడు, లక్ష్మణుడు, టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 8: టీడీపీని ఆదరించండి అని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. గురువారం రంగసముద్రం పంచాయతీ పరిధిలోని రెడ్డినగర్, పెట్రోలు బంకు ఏరియా ప్రాం తాల్లో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా కార్యదర్శి తిరుమలశెట్టి సుబ్బారావు, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ చెన్నరాయుడు, ఎంపీటీసీ కల్వకూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

కలసపాడు ఫిబ్రవరి 8 : మండలంలోని చెన్నుపల్లెలో గురువారం బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. బద్వేలు మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ రంతుల్లా, మండలపార్టీ అధ్యక్షుడు జి.వెంక టరామిరెడ్డి, భద్రయ్య, నాగేశ్వర్‌రావు, నారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్నతోనే రాష్ట్ర అభివృద్ధి



మహిళలకు కరపత్రాలు అందిస్తున్న బొజ్జ అరుణ

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 8: రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు సుధారాణి, నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవిలు అన్నారు. గురువారం మండల పరిధిలోని రాజుపాలెం తదితర గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోలో మహిళల కోసం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా, మండలపార్టీ అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, సింగరయ్య, సుధాకర్‌రెడ్డి, రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో వైసీపీ అభ్యర్థిని మార్చితేనే గెలుపు సాధ్యం

- రాచమల్లుకు టిక్కెట్టు ఇస్తే వైసీపీ ఓటమి ఖాయం
- వైసీపీ అసమ్మతి నేతలు సర్పంచ్ శివచంద్రారెడ్డి, ఇర్ఫాన్‌లు ధ్వజం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 8: ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని పార్టీ అధిష్టానం ప్రకటించకుండానే.. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి తానే అభ్యర్థినని తనుకు తానే ప్రకటించుకుని 15 నుంచి ప్రచారం చేస్తానని తెలపడం పార్టీ నియమాలను ఉల్లఘించ డమేనని వైసీపీ అసమ్మతి నేతలు సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కౌన్సిలర్ ఇర్ఫాన్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వెల్లాల భాస్కర్‌లు పేర్కొన్నారు. గురువారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని శివచంద్రారెడ్డి ఆయిల్ మిల్లులో విలేకరులతో మాట్లాడుతూ రాచమల్లు ప్రసాద్ రెడ్డి ఎదుటి వారిని విమర్శించే ముందు తన వీపు చూసుకోవాలన్నారు. కొత్తపల్లె పంచాయతీలో డాక్టర్ ఎంవీఆర్ కుటుంబాన్ని ఎదిరించి 20 వార్డులకు 17 వార్డుల అభ్యర్థులు నా ఆధ్వర్యంలో విజయం సాధించారన్నారు. కొత్తపల్లె పంచాయితీలో నీపెత్తనం కోసం 11 మంది వార్డు మెంబర్లను ఒక్కో మెంబర్‌కు రూ.8లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఇచ్చి సొంతపార్టీ మెంబర్లనే సంతలో పశువులను కొన్నట్లు కొని మళ్లీ ఎదుటి వారిని ఏవిధంగా విమర్శిస్తావన్నారు. ప్రొద్దుటూరులో వైసీపీ అభ్యర్థిని ప్రకటించే ముందు పార్టీ అధిష్టానం సర్వే చేయాలన్నారు. ఎమ్మెల్యే రాచమల్లుపై పార్టీలోనే అంతర్గతంగా తీవ్రమైన వ్యతిరేకత వుందని.. ప్రజల్లో ఇక ఆయన పట్ల వున్న వ్యతిరేకత రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యేపై లేదన్నారు. రాచమల్లుకు



మాట్లాడుతున్న వైసీపీ నాయకుడు సర్పంచ్ శివచంద్రారెడ్డి

టిక్కెట్టు ఇస్తే పార్టీ ప్రొద్దుటూరును కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రొద్దుటూరులో వైసీపీ అభ్యర్థిని రాచమల్లుకు కాకుండా బీసీలకైనా, మైనారిటీలకైనా లేక ఇతర ఓసీలకైనా ఇవ్వాలన్నారు. లేదంటే వైఎస్ కుటుంబం వారే పోటీ చేసినా ఇక్కడ గెలిపించు కుంటామన్నారు. జిల్లాలో రాజంపేట, బద్వేలు అభ్యర్థులను మాత్రమే పార్టీ అధికారికంగా ప్రకటించిందన్నారు. ఇంకా జిల్లాలో ఆయా నియోజకర్గాల్లో అభ్య ర్థులను అధికారికంగా ప్రకటించాల్సి వుందన్నారు. సీఎం జగన్ ఇంకా ప్రొద్దు టూరు అభ్యర్థిపై నిర్ణయం తీసుకోలేదని ఖచ్చితమైన సమాచారం వుందన్నారు.

11న వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 8: వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ ఉదయం అమ్మవారికి విశేషపూజలు చేసి.. గణపతి, నవగ్రహ, చండీ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పిస్తారన్నారు. అమ్మవారికి పూజా ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య కన్యకలతో 102 గంపల పూలతో పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారిని అభిషేకిస్తామన్నారు. 102 మంది ఆర్యవైశ్య మహిళలతో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు.

బడ్జెట్ అంచనాలు కొండంత...ఖర్చులు పిసరంత

- మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అంచనాలు మాత్రం కొండంత ఉన్నాయని, ఖర్చులు మాత్రం పిసరంత ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి విమర్శించారు. గురువారం సాయంత్రం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మాట్లాడారు. మంత్రి బుగ్గన బడ్జెట్ అంకెల గారడీ అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడా లేదని ఆయన ప్రశ్నించారు. రూ.13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు మించిన కొండలాగా బుగ్గన బడ్జెట్ అన్నారు. రాష్ట్రంలో పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు రూ.11.58 లక్షల కోట్లు అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బడుగు, బలహీన వర్గాలకు, అన్ని వర్గాల ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి చేసింది ధరల పెంపు మాత్రమేనన్నారు. పన్నుల భారం తప్ప మరేమీ లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీనివాసులు, నల్లగట్ల బూసిరెడ్డి, చిన్నపసుపుల శ్రీనివాసరెడ్డి, సుబ్బరాజా, అంబవరం రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

దూసుకుపోతున్న టిప్పర్లు



వేగంగా వెళుతున్న టిప్పర్లు

మైదుకూరు, ఫిబ్రవరి 8: మైదుకూరులో పట్టణంలో సుద్ద తీసుకపోతున్న ట్రిప్పర్లు అధిక వేగంతో వెళుతూ పాదాచారులను హడలెత్తిస్తున్నాయి. స్థానిక గగ్గితిప్ప నుంచి సుద్దను జాతీయ రహదారి పనుల కోసం టిప్పర్లు తీసుకెళుతున్నాయి. మైదుకూరు పట్టణంలో రోజురోజుకు రద్దీ పెరగడంతో పాటు వాహన రాకపోకలు పెరిగిపోతున్నాయి. టిప్పర్ల వేగం ధాటికి పాదాచారులు బెంబేలెత్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల టిప్పర్ వేగానికి భయపడి ఇద్దరు మహిళలు కింద పడటంతో స్వల్పగాయాలయ్యాయి. టిప్పర్ల వేగాన్ని పోలీసులు కట్టడి చేయాలని పాదాచారులు కోరుతున్నారు.

వైభవంగా లింగమయ్యస్వామి తిరుణాళ్ల



పూజలందుకుంటున్న లింగమయ్య స్వామి

కొండాపురం, ఫిబ్రవరి 8 : మండలంలోని చౌటిపల్లె గ్రామంలో గురువారం లింగమయ్య స్వామి తిరుణాళ్ల వైభవంగా జరిగింది. తిరుణాళ్లలో భాగంగా లింగమ్యస్వామితో పాటు గ్రామ దేవతలు పెద్దమ్మ, అంకాళమ్మలకు భక్తులు బోణాలు సమర్పించుకున్నారు. అదేవిధంగా కొంతమంది జంతు బలులు ఇచ్చి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి, టీడీపీ నేతలు సీఎం సురేష్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీలు నారాయణరెడ్డి, శివనాథరెడ్డి తదితరులు పాల్గొని లింగమ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ తిరుణాళ్లకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చౌటిపల్లె గ్రామం గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురి కావడంతో గ్రామస్తులు కొండాపురం మండలంలోని గండ్లూరు వద్ద, ముద్దనూరు మండలంలోని కమ్మవారిపల్లె వద్ద పునరావసం క్రింద ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ రెండు చోట్ల లింగమయ్య స్వామిని ప్రతిష్ఠించి తిరుణాళ్లను జరుపుకున్నారు.

పాలకుల వివక్షతో ముందుకు సాగని కడప ఉక్కు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 8: పాలకుల వివక్షతతో కడప ఉక్కు ముందుకు సాగడంలేదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ అన్నారు. కడప ఉక్కు కోసం డీవైఎఫ్ఐ నాయకులు గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీ కడప ఉక్కును పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి ఏ ఒక్కరోజు స్టీల్‌ప్లాంట్ గురించి అడిగిన పాపాన పోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం కనీసం చివరి బడ్జెట్ సమావేశాల్లో అయినా పార్లమెంటులో కడప ఉక్కుకు నిధులు కేటాయిస్తారని ఎదురుచూస్తే మరోసారి మోసం చేసిందన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



క్యాంబెల్ వైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

జమ్మలమడుగు, ఫిబ్రవరి 8: పట్టణంలోని క్యాంబెల్ వైద్యశాలను జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ పి.శాంతికళ తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో పరిశీలించి పుట్టబోయేది ఆడబిడ్డ, మగబిడ్డ అనే అడగడం, చెప్పడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలోని స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేసి సూచనలు ఇచ్చారు. ఏదైనా స్కానింగ్ సెంటర్‌లో లింగబేదం తెలిపినట్లయితే మొదటిసారిగా రూ.50 వేలు జరిమానా విధిస్తామని, రెండవసారి పట్టుబడితే సెంటర్‌ను సీజ్ చేస్తామని ఆమె హెచ్చరికలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, డాక్టర్లు పాల్గొన్నారు.

టిప్పర్లను తిరగనివ్వం



రోడ్డుకు అడ్డంగా మొద్దులు పెట్టిన మహిళలు

ముద్దనూరు ఫిబ్రవరి 8: పులివెందుల నుంచి రైల్వే స్టేషన్‌కు ఖనిజాన్ని తరలిస్తున్న భారీ ట్రిప్పర్లను గురువారం ఆర్టీపీపీ రోడ్డులోని స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీపీపీ రోడ్డు నుంచి భారీ ట్రిప్పర్లు ఖనిజాన్ని తరలిస్తున్నాయని, ప్రతిరోజు రాత్రి పగలు తేడా లేకుండా ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తూ భారీ సంఖ్యలో వాహనాలు వస్తున్నాయన్నారు. దీంతో పిల్లలు భయటకు వస్తే ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని బిక్కు బిక్కుమంటూ నివాసం ఉంటున్నామన్నారు. దాదాపు రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఉందన్నారు. దాదాపు 100 కుటుంబాలు ఆర్టీపీపీ రోడ్డులో ఉన్నాయన్నారు. స్పందన కార్యక్రమంలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. భారీ ట్రిప్పర్లు తిరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా అగస్త్యేశ్వరస్వామి కల్యాణం



అగస్త్యేశ్వరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 8: అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మాస శివ రాత్రి సందర్భంగా స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగాగౌరి సమేత అగస్త్యేశ్వరస్వామికి వేద పండితులు సుముహూర్తంలో కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారి కల్యాణం తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అధికారులు సహకరించినప్పుడే అభివృద్ధి

గోపవరం, ఫిబ్రవరి 8: అధికారులు సహకరించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్‌డి షేక్ హసీనా, ఎంఎస్‌వో డాక్టర్ మర్రిపాటి నాగరాజు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అభివృద్ధిపై ఆయా శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల గణన, ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ, ఈకేవైసీ, ఈ పంట నమోదు, గృహ నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్లు, జీజీఎంపీ లాంటి తదితర పనులపై సమగ్రంగా చర్చించడం జరిగిందన్నారు. పనులన్నింటనీ కూడా నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి., విజయకుమార్, నిఖిత, వెంకటసుబ్బయ్య, హౌసింగ్ ఏఈ రామక్రిష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఐఈ రవితేజ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవి, ఏపీవో విజయమ్మ, ఏపీవో శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభూమిపట్ల మమకారం ఉండాలి



తేగులపల్లి సదాశివారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 8: మాతృభూమిపట్ల ఎక్కడికి వెళ్లినా ఉన్నతస్థానంలో ఉన్నప్పటికి సదా మమకారం ఉండాలని అమెరికాలో వైద్యునిగా సేవలు అందిస్తున్న డాక్టర్ తేగులపల్లి సదాశివారెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం జమ్మలమడుగు మండలంలోని మోరగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కంఠస్తం చేసి రాసే పరీక్షల కన్నా విద్యను అర్థం చేసుకుని ఆలోచించి నేర్చుకుని రాయాలన్నారు. విద్యార్థులకు నిరంతర విద్య తప్పనిసరి అని ఉన్నత విద్యతో భవిష్యత్తును రూపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు శారీరక, బౌతిక వ్యాయామంతోపాటు క్రీడా రంగంలో ఉత్సాహంగా ఉండాలన్నారు. స్వార్థం ప్రమాదకరమని, సమాజానికి ఉన్నతస్థానంలో వెళ్లినవారు సేవ చేయాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో గతంలో నాటిన మొక్కలకు సంరక్షణ కొరకు ఆర్థికసాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో అమృత హస్తం సభ్యుడు రోషిరెడ్డి, నరసింహులు, సీతాలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.